క్లుప్తంగా

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

శిరివెళ్ల: ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నామని డ్వామా పీడీ సూర్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2025-26 సంవత్సరానికి 4,500 ఎకరాలలో ఉద్యాన పంటల సాగు లక్ష్యం కాగా ఇంత వరకు వెయ్యి ఎకరాలలో సాగుకు రైతులు ముందుకొచ్చారన్నారు. మొక్కల పెంపకానికి జిల్లాలో 3 చోట్ల నర్సరీలు ఏర్పాటు చేశామన్నారు. గతేడాది రూ. వంద కోట్ల ఉపాధి పనులు జరిగాయని అందులో రూ.26 కోట్ల విలువైన సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు జరిగాయన్నారు. కూలీల వేతనాలు దశల వారీగా మంజూరవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏంపీడీఓ శివమల్లేశ్వరప్ప పాల్గొన్నారు.

జీవో 77ను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పేద విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేసేలా ఉన్న జీవోనం.77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 77ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 11వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీల పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. అర్హతలు ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఇన్ కంప్యూటర్ సైన్స్, ఎంటెక్‌లో కనీసం 55 శాతం మార్కులతో పీజీ, పీహెచ్‌డీ లేదా నీట్ సెట్ స్లేట్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్హతలు, అనుభవం వివరాలతో కూడిన పూర్తి బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు ఈనెల 17లోగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెయిల్ ఐడీకి పంపించాలన్నారు.మరింత సమాచారం కోసం 6302146800ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

పీ-4తో పేద కుటుంబాలు బలోపేతం

ఉయ్యాలవాడ: పీ-4 కార్యక్రమంతో పేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని జిల్లా డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి శ్రీదర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 కార్యక్రమంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో 20 గ్రామాల్లో పి-4 సర్వే 982 నిరుపేద బంగారు కుటుంబాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు 12 మంది ఎన్ఆర్‌లు ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

13న ఉచిత కంటి వైద్య శిబిరం

నంద్యాల(వ్యవసాయం): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు మోహన్‌కిరణ్, చంద్రశేఖర్‌లు గురువారం తెలిపారు. స్థానిక టెక్కె మార్కెట్‌యార్డు వద్ద ఉన్న విశ్వహిందూ పరిషత్‌కార్యాలయంలో డాక్టర్ రామసుబ్బారెడ్డి, కంటివైద్యుల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అలరించిన హరికథాగానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై భీమవరానికి చెందిన పాల రామాంజనేయులు భాగవతార్ వారి భక్తమార్కండేయ హరికథాగానం అలరించింది. మృదంగ సహకారాన్ని హరికృష్ణ, వయోలిన్ సహకారాన్ని గురుప్రసాద్ అందించారు.

విద్యార్థిపై తేనెటీగల దాడి

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి య.నరసింహపై గురువారం తేనెటీగలు దాడి చేయడంతో మెడ దగ్గర వాపు వచ్చింది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థికి సపర్యలు చేసి కాసేపు విశ్రాంతి ఇచ్చారు. కాగా 6, 7 తరగతి గదులకు వెళ్లే సమయంలో మెట్ల వద్ద ఉన్న తుట్టెలు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

కేసు నమోదు

జూపాడుబంగ్లా: రోడ్డుప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7న తాటిపాడు గ్రామంలో పీర్ల పండగను చూసేందుకు సోఫిసాహెబ్ బైక్‌పై వస్తుండగా అదే గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా అతివేగంగా రాంగ్‌రూట్లో బైక్‌పై వచ్చి ఢీకొన్నాడన్నారు. తీవ్రంగా గాయపడిన సోఫిసాహెబ్ చికిత్స అనంతరం కోలుకున్న తర్వాత ఫిర్యాదు చేయడంతో మహబూబ్‌బాషాపై కేసు నమోదు చేశామన్నారు.

జ్ఞానామృతం పంచిన గురుపౌర్ణమి



నంద్యాల ఎన్‌కేరోడ్డులో బంగారు సింహాసనంపై భక్తులు దర్శనమిస్తున్న శ్రీషిర్డిసాయిబాబా



బొమ్మలసత్రంలో బాబా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



ఆలయ ఆవరణలో కోలాటం ఆడుతున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించే గురువులను భగవంతునికి, భక్తునికి మధ్య అనుసంధానంగా భావించి గురుపౌర్ణమి నాడు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నాగులకుంట రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయమే, పంచామృతాభిషేకాలు, విష్ణుసహస్ర నామాలు, విశేషాలంకారాలు, పూలంగిసేవ, మధ్యాహ్నం కాకడ హారతి, నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వామి వారికి బంగారు సింహాసనం, మకర తోరణాలతో ప్రత్యేక అలంకరణ ఆకట్టుకుంది. దాదాపుగా 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ నిర్వాహకులు నిచ్చెనమెట్ల సుబ్బరామయ్య, కల్లూరు రామలింగారెడ్డి, కందుకూరి శ్రీరామమూర్తి తెలిపారు. అలాగే బొమ్మలసత్రంలోని షిర్డీసాయిబాబా దేవాలయంలో పారాయణం, హోమాలు, నిర్వహించి భక్తులకు అన్నదానం చేపట్టారు. చిన్నారులు, మహిళ కోలాటాలు, చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్థానిక కల్పనా సెంటర్‌లోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. కాశిరెడ్డినాయన, గంగమ్మ అవ్వల విగ్రహాలకు ఉదయమే అభిషేకాలు నిర్వహించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని అమ్మాస్ఫటిక లింగేశ్వర ఆలయంలో హోమాలు నిర్వహించారు. ఎన్‌జీఓ కాలనీలోని సాయి కరణాలయం నందు శ్రీ.శే. శ్యాంచరణ్‌బాబా చిత్రపటానికి అభిషేకం నిర్వహించి విష్ణుపారాయణాలు, భజనలు, నామ సంకీర్తనలు నిర్వహించారు. స్థానిక వన్‌టౌన్ ఏరియాలోని కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు ఉదయమే పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారికి వడిబియ్యం, చీర, సారెను సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఊరూరా భక్తి శ్రద్ధలతో..



శ్రీషిరిడిసాయి మూలవిరాట్

చాగలమర్రి/శిరివెళ్ల/దొర్నిపాడు/రుద్రవరం: స్థానిక షిర్డీ సాయినాథుని మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఆర్యవైశ్య సభ, శ్రీఅయ్యప్పాస్వామి సేవా సమాజం, శ్రీషిర్డీ సాయి సేవా సమాజం సంయుక్తంగా కలిసి భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథ భక్తులు తెల్లవారు జామున కాగడ హారతితో శ్రీషిరిడిసాయి సత్యవ్రత కార్యక్రమం ప్రారంభించారు. సాయిబాబా చిత్రపటంతో జోలెలతో ఇంటింటి వద్ద బిక్షాటన చేసి, అమ్మవారిశాల నుండి భక్తులు భజనలతో పాతబస్టాండు సమీపంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో వున్న బాబా మందిరానికి విచ్చేశారు. అనంతరం సాయినాథునికి వేద పండితులు కై ప వేంకటనరసింహ శాస్త్రి (పెద్దశాస్త్రి) చే వేద మంత్రోచ్చారణలతో శ్రీషిరిడి సాయి సత్యవ్రత కార్యక్రమం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. శిరివెళ్ల మండలంలో శ్రీ కాశిరెడ్డి నాయన ఆశ్రమం, వెంకటాపురం, వెంకటాపురం, యర్రగుంట్ల, వీరారెడ్డిపల్లె దత్తాశ్రమం, గుంప్రమాన్‌దిన్నె, మహదేవపురం గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. మండల కేంద్రమైన రుద్రవరంలోని సాయిమందిరంలో పూజారి విశ్వనాథశర్మ స్వామివారికి పంచామృతాభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సాయిబాబ జీవిత చరిత్ర, బోధనలు వివరించారు. దొర్నిపాడు సాయి బాబా ఆలయానికి భక్తులు పోటెత్తారు.



సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చాగలమర్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

వివాద పరిష్కారానికి మధ్యవర్తిత్వతాన్ని ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్నరాజా

నంద్యాల(వ్యవసాయం): ప్రధాన వివాద పరిష్కార సాధనంగా మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలని మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజా, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమని, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, స్పెషల్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏసురత్నం లన్నారు. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదుల కోసం ''మధ్యవర్తిత్వం కోసం దేశం'' అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా సులువుగా పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమం అన్ని కోర్టుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 90రోజుల పాటు న్యాయవాదులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. శిక్షణ పొందిన న్యాయవాదులచే బార్ అసోసియేషన్ న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రావినూతల దుర్గాప్రసాద్, రామచంద్రారావు, జయకృష్ణ, శ్రీదేవి, ఓబులరెడ్డి, తిరుపతి, జగన్‌మోహన్‌రెడ్డి, వివేకానందరెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్యూఎల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని..



నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): డిగ్రీలో డ్యూఎల్ మేజర్ విధానాన్ని కొనసాగించి ఇంటర్‌షిప్ భారాన్ని తగ్గించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ.. డ్యూఎల్ డిగ్రీ విధానం అమలు పరుస్తున్నామని, ఉత్తర్వులు ఇచ్చి ఆచరణలోకి వెళ్లకుండానే రివ్యూ జరిపి సింగిల్ మేజర్ విధానమే కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న స్టేక్ హోల్డర్స్‌తో సంప్రదించకుండా పూటకో నిర్ణయం చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఉన్నత విద్యా మండలిలో చేసిన నిర్ణయానికి అనుగుణంగా కొనసాగించాలని డిమాండ్‌చేశారు. వెంటనే ఆఫ్‌లైన్ పద్ధతిలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్, సాయి, విజయ్, జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

పైర్లు ఎండిపోతే ఈఈదే బాధ్యత

గోస్పాడు/నంద్యాల అర్బన్: కేసీ కెనాల్ కింద సాగు చేసిన పంటలు ఎండిపోతే ఈఈ బాధ్యత వహించాల్సి వస్తుందని రాయలసీమ సాగునీటి సమితి మండల అధ్యక్షుడు బెక్కెం రామసుబ్బారెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో లక్ష ఎకరాల దాకా మొక్కజొన్న, సోయాబీన్, మినుము వంటిపైర్లు సాగు చేశారన్నారు. వర్షాలు లేకపోవడంతో పంటలు తొలగిస్తున్నారన్నారు. సాగునీటి విషయంపై కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్ ఈనెల 9వ తేదీన రాయలసీమ సాగునీటి సంఘం బృందం కలువగా 'ఎవరిని అడిగి పంటలు వేశారని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం సరికాదన్నారు. పోతిరెడ్డి పాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా వివిధ ప్రాజెక్టులకు నీరు విడుదల చేస్తున్న అధికారులు కేసీ కెనాల్ కింద పంటలు ఎండిపోతున్నా నీరు ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలన్నారు. నీటి విడుదలలో జలవనరుల శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లే విధంగా ఉందని, అందుకు కేసీ కెనాల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేసీ కెనాల్ అధికారుల తీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్తామని, అప్పటికీ స్పందించకపోతే కేసీ కెనాల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు పట్నం రాముడు, మహేశ్వరరెడ్డి, భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించు కుని స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. గురువారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ఊయలసేవ

శ్రీశైల భ్రమరాంబాదేవికి గురువారం పౌర్ణమి ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను ఊయలలో ఆశీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించిన అ నంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి,ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.



హైవేపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

నిర్లక్ష్యంపై నిరసన

నేషనల్ హైవే 340సీ నిర్మాణంలో భాగంగా పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలో తాగునీటి పైపులైన్ ధ్వంసమైంది. దీంతో తుమ్మలూరు, క్రిష్ణాపురం గ్రామస్తులకు తాగునీటి సమస్య నెలకొంది. నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరినా కాంట్రాక్టర్ దక్కించుకున్న పీఎస్‌కే సంస్థ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తామని, కొత్త పైప్ లైన్ వేసేది లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు ఖాళీ బిందెలతో హైవేపై గురువారం ధర్నాకు దిగారు. సుమారు 2 గంటల వరకు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎస్ఐ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్డీఓ అక్కడి నుంచే నేషనల్ హైవే పీడీ పద్మజతో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె గ్రామానికి చేరుకుని పరిశీలిస్తామని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ప్రజలు నిరసన విరమించారు.

– పాములపాడు

అహోబిలం అధికారిపై దాడికి యత్నం

ఆళ్లగడ్డ: అహోబిలం దేవస్థాన అధికారిపై ఓ దుండగుడు దాడికి యత్నించిన సంఘటన నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో పదవీ విరమణ పొందిన రఘు అనంతరం అహోబిలం దేవస్థానంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నారు. అయితే రాత్రి పొద్దుపోయిన తరువాత ఓ వ్యక్తి తాను కొరియర్ బాయ్‌నని, పార్సిల్ వచ్చిందని చెప్పడంతో రఘు బయటకు వచ్చాడు. దగ్గరకు వచ్చిన రఘుపై దుండగుడు 'మీరంతా ఎవరురా? ఎక్కడెక్కడ నుంచో అహోబిలం వచ్చి మాపై పెత్తనం చెలాయిస్తారా.. మర్యాదగా అహోబిలం వదిలిపెట్టి పోతావా లేదా అని బెదిరించాడు. తనను దేవస్థానం అపాయింట్‌మెంట్ చేసుకుంటేనే వచ్చానని చెప్పడంతో మళ్లీ 'నాకే ఎదురు చెబుతావా' అంటూ వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేసేందుకు యత్నించాడు. అప్రమత్తమైన రఘు ఒక్క ఉదుటున ఇంట్లోకి వెళ్లి గేట్ వేసుకున్నాడు. వెంటనే ఈ విషయం అహోబిలం దేవస్థాన ప్రతినిధులకు తెలియజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గత రెండు రోజుల క్రితం మరో అధికారిపై సైతం ఇలాగే రాత్రి అతని ఇంటిదగ్గరకు వెళ్లి మద్యం మత్తులో ఉన్న దుండగులు కత్తులతో దాడి చేసేందుకు యత్నించగా అతను గమనించి ఇంట్లో నుంచి ఉదయం వరకు బయటకు రాకుండా లోపలనే భయంగా భయంగా గడిపినట్లు తెలిసింది. మరో ఉద్యోగి బెదిరింపులకు, బ్లాక్ మెయిల్‌కు తట్టుకోలేక ఉద్యోగం వదులుకుని పోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఈ విషయంపై సీఐ మురళీధర్‌రెడ్డిని వివరణకోరగా.. క్షేత్రంలోని సిబ్బందిని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా గంధం వేడుకలు



విద్యుదీపాలకరణలో దర్గా

చాగలమర్రి: చిన్నమకానం వీధిలో వెలసిన శ్రీగౌస్ పీర్‌షా ఖాద్రీ స్వామి దర్గా గంధం వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ జిల్లా కమలాపురం హజ్రత్ సయ్యద్ గఫారియా దర్గా పీఠాధిపతి శ్రీహజ్రత్ సయ్యద్ మౌలానాషా ఖాద్రీ హాజరయ్యారు. భారీగా తరలి వచ్చిన భక్త జనసందోహం మధ్య ఫకీర్ల మేళతాళాలతో గంధం స్థానిక ఆసారే షరీఫ్ నుంచి ఊరేగింపుగా పీఠాధిపతి శ్రీసయ్యద్ లాలామియ్య షా ఖాద్రీ ఆధ్వర్యంలో దర్గా వద్దకు తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దాత చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్, ముల్లా షఫీ, ముల్లా చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉరుసు, 12న శనివారం జియారత్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు.



గంధం, చాదర్ సమర్పిస్తున్న హజ్రత్ సయ్యద్ మౌలానా షా ఖాద్రీ

'అక్షరాంధ్ర'ను విజయవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో అక్షరాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ రాజకుమారి అక్షరాంధ్ర ఉల్లాస్-2 కార్యక్రమంపై అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా 1,00,586 మంది నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ఆగస్టు 7 తేదీన జిల్లాలో అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభించి మార్చి చివరి నాటికి విజయవంతంగా జిల్లాకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. వయోజన విద్యాశాఖ తరపున నిరక్షరాస్యులందరికీ టెస్ట్ బుక్స్, వర్క్ షీట్స్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి, డీఈఓ నంద్యాల జిల్లా వయోజన విద్య ఉపసంచాలకులు చంద్రశేఖర్ రెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ మోడల్ ఆఫీసర్, తదితరు అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం



సిబ్బందికి సన్మానం చేస్తున్న గ్రామస్తులు

శిరివెళ్ల: గ్రామ సచివాలయ సిబ్బంది సేవలు మరువలేనివని ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ అన్నారు. బదిలీపై వెళ్తున్న గుంప్రమాన్‌దిన్నె గ్రామ సచివాలయ సిబ్బందికి గురువారం గ్రామస్తులు సన్మానం చేశారు. అధికారులు, గ్రామస్తుల సహకారంతో ఐదేళ్ల తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజల మన్ననలను పొందారని ఈఓఆర్డీ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవిశంకర్, వీఆర్ఓ కృష్ణయ్య, సర్పంచు తలారి జానకమ్మ, నీటి సంఘం అధ్యక్షుడు కుందూరు మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు షైకం నరసింహారెడ్డి, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరం: బదిలీపై వెళ్తున్న మందలూరు, ఆర్.నాగులవరం, ముత్తలూరు, పెద్దకంబలూరు, ఎల్లావత్తుల, కోటకొండ, ఆలమూరు, చిత్రేనిపల్లె, చిన్నకంబలూరు వీఏఏలను గురువారం సన్మానించారు. రుద్రవరం వ్యవసాయ కార్యాలయంలో ఏఓ సుమతి, ఏఈఓ రాజు తదితరులు వీఏఏలను శాలువా, పూలమాలతో సత్కరించి వీడ్కోలు పలికారు.

భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు





రూపనగుడిలో దస్తగిరి, మౌలాలి స్వామి పీర్లకు గ్రామోత్సవం, గోస్పాడులో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: రూపనగుడి, అల్లూరు, తుడుమలదిన్నె, ఇంజేడు, గోవిందపల్లె గ్రామాల్లో జియారత్ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం ముగిసిన మూడు రోజులకు పైగ్రామాల్లో జియారత్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా సాగుతూ వుంది. ఇందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి అనంతరం జియారత్ వేడుకలు ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు దస్తగిరి స్వామి, మౌలాలి స్వామి పీర్లకు ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గోస్పాడు: మండల కేంద్రమైన గోస్పాడులో మౌలాలి స్వామి జార్తలను ప్రజలు కుల, మతాలకు అతీతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడులు చెల్లిస్తున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఇంటింటి గ్రామోత్సవం కార్యక్రమం పేరుతో స్వామి వారి ఊరేగింపు కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా ఎస్ఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి



నంద్యాల బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తానని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పేరెంట్స్ 2.0 సమావేశానికి (తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనం) కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తల్లి ప్రాధాన్యత వివరించడమే తల్లికి వందనం ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాలలో క్రీడా మైదానంలో వర్షా కాలంలో నీరు నిల్వ ఉంటుందని, అదనపు తరగతి గదులు నిర్మించాలని, ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని ఇవ్వాలని తల్లిదండ్రులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి ఫరూక్ భోజనం చేశారు. జిల్లాలో 1959 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ డేను నిర్వహించారు.

నంద్యాల(న్యూటౌన్) స్థానిక పొట్టి శ్రీరాములు పాఠశాలలో ఎంఈఓ బ్రహ్మంనాయక్ హాజరై పాఠశాల అభివృద్ధికి విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు.

ఉయ్యాలవాడ: మోడల్‌స్కూల్‌లో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంఈఓ రఘురామిరెడ్డి పాల్గొని మాట్లాడారు. దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి గోవిందనాయక్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. రుద్రవరం మండ లం ముకుందాపురంలో ఈ సందర్భంగా విద్యార్థు ల తల్లిదండ్రులకు తాడాట, మ్యూజికల్ చైర్స్, స్పూన్ నిమ్మకాయ వంటి ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.